
# కొత్త మలుపు

మల్లాది రవిశంకర్





**రైల్వేలో ఏ వేళావిశేషాన ఉద్యోగం దొరికిందో కానీ, రైలింజన్‌లా దేశమంతా చెడతిరిగేశాను. అయినా జన్మభూమికి వెళ్లే అవకాశం రానేలేదు.**

ఇంకో సంవత్సరంలో రిటైర్‌అవుతావని ఉత్తరం పంపించేదాకా నేనింకా నిత్యయవ్వనుడనిన్నీ, నలభై ఊళ్ల అందగాడిననిన్నీ అనుకుంటూనేవుండే వాడిని. అలాంటిది ఇంక నీ వయస్సు అయిపోయిందనీ, ఇంటికెళ్లి రెస్ట్‌తీసుకోమని రైల్వేవాళ్లు గుర్తుచేయటంతో అరవైఏళ్ల వార్ధక్యం ఒక్కసారి టప్పుమని మీద పడ్డట్టుగా అనిపించడంతో ఒక్కసారి నా జన్మభూమి, ఇంతకాలం తాళం వేసుంచిన ఇల్లు గుర్తుకొచ్చినాయి. కౌలుకిచ్చిన పొలంమీద వాళ్లెంత ఫలసాయం ఇస్తే దానిని నోరుమూసుకుని పుచ్చుకునేవాడిని ఇంతకాలం.

అయినా ఉన్నది ఎంతమందిమని! లింగులిటుకుల్లా నేనూ, నా ధర్మపత్ని ఆండాళ్లు. ఆండాళ్లు పిచ్చిఇల్లాలు. కడుపు పండలేదన్న బాధ తనకి మొదట్లో బాగా ఉండేది. ఇప్పుడు అలవాటు పడిపోయింది. మహిళామండలి అవీ ఇవీ అంటూ తనని తానే బిజీగా ఉంచుకుంటుంది. అసలు విషయానికి వస్తే రిటైర్ అవుతున్నాననే గుబులు ఒక పక్క పట్టిపీడిస్తూ ఎక్కడ సెటిల్ అవ్వాలనే విషయాన్ని గురించి ఒక నిర్ణయానికి రాలేకపోతుండగా ఒకసారి మాఊరికి వెళ్లాలనిపించింది. అదే మా ఆండాళ్లుతో అనగానే గయ్యిన ఇంతెత్తున లేచింది తారాజువ్వలా. "మాఊరుట మాఊరు...ఆ పల్లెటూరు నేను రాలేనుబాబూ! అయినా నేనిలా ఊళ్లుపట్టి తిరిగితే నా మహిళామండలి ఏంగాను?" అని ఒకసారి నా వంక చూసి మరేమనుకుందో ... "పోనీ ఒక మూడు రోజులు ... అంటే సరిగా 72 గంటలు మీ ఊళ్లో ఉంటాం, అంతే!" అనేసరికి 'అమ్మయ్య' అనుకున్నాను.

రెండురోజులు ప్రయాణం చేసి, నాకు అన్నం పెట్టిన రైల్వేవాళ్లిచ్చిన ఫ్రీపాస్‌లమీద విజయవాడ దాకా చేరుకుని అక్కడినుండి ఎర్రబస్సెక్కి మా ఊరు బయలుదేరాము. బస్సు మా ఊరువైపు పరుగెడుతుంటే ఎప్పుడో చూసిన మా ఊరు చిత్రం కళ్లముందు మెదిలింది.

మాది రోడ్డు పక్క ఊరు. ఊరు మొదట్లోనే రోడ్డుకు ఒక వైపు రుద్రభూమి. దానికి కొంచెం ఎడంగా ఆంజనేయస్వామి మందిరం. మందిరానికి ఎదురుగా పెద్దచెరువు. చెరువు గట్టుమీద గిలకబావి. అప్పట్లో గ్రామానికి అదే మంచి నీళ్లబావి. దాని ఎదురుగా నేను చదువుకున్న అప్పర్‌ప్రైమరీ స్కూల్. స్కూల్‌కి కొంచెందూరంలో గ్రామదేవత గుడి. మళ్లీ రోడ్డెక్కి ముందుకెడితే పాల కేంద్రం. దానిని ఆనుకుని గ్రామపంచాయితీ ఆఫీసు. ఆఫీసుకి ఎదురుగా కమ్మవారి వీథి. ఒంకెంచె ముందుకు వస్తే సెంటర్. నా చిన్నతనంలో అక్కడో రేడియో రూమ్ ఉండేది. ఉదయం, సాయంత్రం పంచాయితీ బంట్రోతు వచ్చి ప్రాంతీయవార్తలు పెద్దగా పెట్టి, అవి అవగానే రేడియో కట్టేసి వెడుతుండేవాడు. సెంటర్ ఎదుటిరోడ్డు మీదుగా వెడితే కోమట్లవీథి, వైదీకులవీథి, నియోగులవీథి, భట్రాజులవీథి, కాపులవీథి ప్రత్యేకంగా ఉన్నాయి.

ఆలోచనలలోనే బస్సు మాఊరికి దగ్గర అవటంతో సామాను కిందికిదింపి దిగటానికి తయారుగా ఉన్నాను. బస్సు ఆగీ ఆగగానే ఒకసారిగా కిందికి దిగి ఊరంతా కలియచూశాను. దేశం ప్రగతిపథంలో పయనిస్తున్నా ఆ పల్లెసీమ అంతగా మారినట్లుగా అనిపించలేదు. ఆలోచనలలో పడ్డ నన్ను,

'ఎవరింటికెళ్లాలయ్యా!''' అన్న ఓ ఆసామి

## ప్రెషర్ కుక్కర్

ప్రెషర్ కుక్కర్‌ను 1679లోనే కనుగొన్నారు. లండన్‌లోని రాయల్ సొసైటీలో డెనిస్ పాపిన్ తన స్టీమ్ డైజెస్టర్‌ను ప్రదర్శించాడు. దానికి ఆయన సేఫ్టీ వాల్వ్ కూడా అమర్చాడు. కానీ ఇది వంట విషయంలో 20వ శతాబ్దం వరకూ వాడకంలోకి రాలేదు. మొట్టమొదటిసారిగా ఇది వంట కుక్కర్‌గా అమెరికా మార్కెట్‌లో ప్రవేశపెట్టబడింది. రెండవ ప్రపంచ యుద్ధకాలం వరకూ ప్రెషర్ కుక్కర్‌లు బాగా ప్రచారంలోకి వచ్చాయి. ప్రెషర్ కుక్కర్ వల్ల ఇంధనం ఆదా అవడమే కాక, వంట కూడా త్వరగా, రుచికరంగా అవుతుందని తెలిశాక వీటి వాడకం బాగా పెరిగింది.

**- పి.ఎం. సుందరరావు**

మాటలు ఈలోకంలోకి తెచ్చినాయి. పాతికేళ్లక్రితం వదిలిన నా ఇంటికే వెళ్లాలని ఎలా చెప్పాలో తికమకపడుతుండగా ...

"ఎవరి తాలూకేమిటి?" అని మళ్లీ ప్రశ్నించాడు.

ఇక చెప్పక తప్పదని, "నా పేరు జనార్ధనం. రైల్వేలో సిగ్నల్‌ఇంజనీరుగా ఢిల్లీలోపనిచేస్తూ సంవత్సరంలో రిటైర్ అవబోతున్నాను."

'హరి హరి! నువ్వట్రా, జనా! నేను విశ్వాన్నిరా!' అని కౌగలించుకున్నంత పనిచేశాడు.

చిన్నతనంలో ఇద్దరం కోతికొమ్మచ్చులు, గోళీకాయలు, గోడంబిళ్లలు ... ఇలా ఎన్ని ఆటలాడాం! వినాయకచవితి పండగ వచ్చిందంటే తెల్లారకుండానే తామరపూల కోసం ఊరి చెరువులో పోటీలుపడి ఎంత ఈతలు కొట్టేవాళ్లమని! ఇంతకాలానికి మళ్లీ విశ్వాన్ని చూడటం.

"రారా, జనా! ఇంటికి వెడదాం. రండి, అక్కయ్యగారూ!" అంటూ తొందర చేశాడు విశ్వం.

"ఏమేవ్! ఎవరొచ్చారో చూడు, 'జనా' అని నా బాల్యస్నేహి తుడి గూర్చి చెపుతూంటానే ... వాడు కుటుంబసమేతంగా వచ్చా డే! త్వరగా తెమిలి బయటకు రావే!" అంటూ విశ్వం ఒకటే హడావుడి.

"వస్తున్నానండీ!" అంటూ కొంగుకు చేతులు తుడుచు కుంటూ బయటకు వచ్చింది విశ్వం భార్య. "నమస్కారం, అన్నయ్యగారూ! లోపలికిరండి, వదిన గారూ, కాళ్లు కడుక్కుందురుగాని. చెప్పుడనగా బయలుదేరారో ..కాఫీకలిపి, కొంచెం ఉప్మా కలియబెడతాను!" అని తనలో అనుకుంటున్నట్టుగా పెద్దగా అంటూ సాదరంగా ఆహ్వానించింది.

నేనూ, విశ్వం చిన్నప్పటి విషయాల్లో పడి నిజంగా చిన్నపిల్లలమే అయ్యాం. 'మీ కబుర్లు తర్వాత. అన్నయ్యగారిని లోపలికి తీసుకురండి, ఉప్మా రెడీ!'అంటూ లోపలినుండే పిలిచింది విశ్వంభార్య. ఆమె, మా ఆవిడ అప్పుడే మాటల్లో పడిపోయారు.

"ఒరేయ్, జనా! మీరీ ఊళ్లో ఉన్నన్ని రోజులూ మా ఇంట్లోనే ఉండాలి. కాదంటే ఊరుకునేది లేదు, ఏమంటావే?" అని భార్యవైపు చూశాడు విశ్వం.

"ఇలాంటివాళ్లని అడగాలిటండీ ... వాళ్లు వెడతామన్నా వెళ్లనిస్తామా ఏమిటి?" అంది ఆమె.

విశ్వంభార్య విమలమ్మకీ, మాఆండాళ్లుకీ అంత త్వరగా స్నేహం కుదరటం నాకు చాలా తెరిపిగా అనిపించింది. ఎందుకంటే నాకు విశ్వంతో కలిసి ఊరంతా తిరగటానికి, బాల్యం గురించిన తరగని కబుర్లెన్నో మీసాలు పండిన ఈ వయస్సులో చెప్పుకోటానికి అవకాశం దొరికింది.

ఆండాళ్లు తనూ ఒక బిందె పుచ్చుకొని విమలమ్మతో మంచినీళ్లకి వెళ్లటం నాకు చాలా ఆశ్చర్యంగానే కాకుండా చాలా ముచ్చటగా తోచింది.

స్వచ్ఛమైన గాలిని పీలుస్తూ, దొడ్లో కాసిన నవనవలాడే కూరల్నితింటూ, తియ్యని దిగుడుబావి నీరు తాగుతుంటే సమయం ఇట్టే గడిచిపోయేది. విశ్వంతో పాటు అతని పొలానికి కూడా వెళ్లాను. ఎగుడుదిగుడుగా ఉన్న పొలంగట్ల మీద అలవాటు లేని నా నడకను చూసి విశ్వం ఎగతాళి చేశాడు. ఊరినుంచి పొలంవైపు నడిచి వెడుతుంటే దూరంగా తాటితోపులు నల్లని భూమాతకు పంటచేల పైటకట్టి, మొగలిరేకులు తలలో తురిమి పంట కాలువ నిలువుటద్దంలో ఆమె ఒంపుసొంపుల్ని చూపుతున్నట్లుగా అనిపించింది.

రాత్రి భోజనాలు చేసి నడుం వాల్చగానే -

"ఈరోజు ఏమయిందనుకున్నారూ! విమలమ్మ, నేను మంచినీళ్లకెడుతుంటే ... మీ ఊరి రాఘవయ్యగారు కనిపించారు. కొడుకులిద్దరూ ఆస్తులు పంచుకున్నారట. దాంతో ముసలాయన, ఆవిడ ఒక ఆరునెలలు ఒక కొడుకింట్లో, ఇంకో ఆరునెలలు మరో కొడుకింట్లోను ఉండేటట్లు కొడుకులే ఒప్పందం చేసుకున్నారట. ఆరునెలలు అవగానే రిక్షా పిలిచి - పరుపు చుట్టల్ని, వారి సామాన్ని అందులో పెట్టి వాళ్లని ఇంకో కొడుకింటికి పంపిస్తారట. రిక్షా వెనక ఆమె పాపం నడిచి వెడుతుంటే భలే బాధగా అనిపించింది. వస్తువుల్ని పంచుకున్నట్లు ముసలి తల్లితండ్రులను అలా పంచుకోవటమేమిటండీ....? ముసలితనంలో కని, పెంచిన కొడుకుల ఆదరణ లేకపోయింది పాపం!" అని చెప్తూ ఆండాళ్లు బరువుగా నిట్టూర్పు విడిచింది.

"కొంచెం దూరం వెళ్లేసరికి రంగారావుగారి భార్య మా ఇంటికి రండని తెగ బలవంతం చేసింది. వెళ్లి కూర్చున్న దగ్గర్నుండీ ఏదో నాకు చేసిపెట్టాలని మహా తాపత్రయం. అసలే ఢిల్లీ నుంచి వచ్చారు, మాటిమాటికీ మా ఇంటికి వస్తారా! అం టూ ... వాళ్ల కోడలు పిల్లను పిలిచి, 'అమ్మాయ్! కాస్త ఉప్మా చేస్తాను, ఉల్లి పాయలు తరిగిపెట్టమ్మా!' అని అడిగితే, ఆ పిల్ల నదురూ బెదురూ లేకుండా, కొత్తవాళ్లం ఉన్నామనే ఇంగితమైనా లేకుండా 'ఏమో బాబూ! ఆ ఉల్లిపాయలు తరిగితే నా కళ్లవెంట నీరుకారుతుంది ... నా వల్ల కాదు!' అంటూ ఖచ్చితంగా చెప్పేసింది."

ఆండాళ్లు ఏదో ఇంకా చెప్తూనే ఉంది. అలవాటు లేని తిరుగుడు తిరగటంతో కళ్లమీదకు వెర్రి నిద్ర వచ్చేయటంతో గురకపెడుతూ నిద్రలోకి జారుకున్నాను.

రెండోరోజు విశ్వం నన్ను రొయ్యల చెరువుల దగ్గరకు తీసుకెళ్లాడు.

"ఈమధ్యకాలంలో ఈ ప్రాంతాన్ని పట్టి పీడించిన జాడ్యంరా ఇదీ ...!" అంటూ విశ్వం చెప్పటం మొదలుపెట్టాడు. "సుక్షేత్రమైన మాగాణి పొలంలో ఇదిగో ... ఇలా రొయ్యల చెరువులు తవ్వి వీటి పెంపకం మొదలుపెట్టారు. మొదట్లో విపరీతమైన లాభాలు రావటంతో పొలాలు చెరువులుగా మార్చటం మొదలుపెట్టారు. ఇలా చెరువులు తవ్వటానికి కూలివాళ్లకోసం ఏ రాత్రి రెండుగంటలకో లారీలు వచ్చి ఊళ్లో ఆగేవి. మగకూలీకి రోజుకు వంద, ఆడ కూలీకి రోజుకు యాభై రూపాయలు. దానితో వ్యవసాయానికి కూలీలు దొరక టమే కష్టమైంది. ఒకళ్ల చెరువులో డ్రైనేజీ నీళ్లను ఇంకోళ్ల చెరువులోకి వదలటం మొదలుపెట్టారట. దాంతో ఏదో అంటురోగం వచ్చి రొయ్యలచెరువులమీద విపరీతమైన నష్టాలు రావటం మొదలుపెట్టాయి. చేతులు కాలాక ఆకులు పుచ్చుకుని ఏం ప్రయోజనం? ఇప్పుడు చెరువుల్ని పూడ్చి వ్యవసాయం మొదలుపెట్టటం అంత తేలికైన పనా ఏమిటి?"

అంటూ విశ్వం కథ ముగించ టం, మేము ఇంటికి చేరటం, ముక్కుపుటాలకి ఎప్పుడో చిన్నప్పుడు పీల్చిన కమ్మని వాసనరావటం జరిగింది.

మా కోసం ఆ రోజు విమలమ్మ నేతిగారెలు చేసింది. నేతిగారెలు కడుపారా ఆరగించి కొంచెం నడుం వాల్చానో, లేదో ... ఆండాళ్లు ఆ రోజు తన అనుభవాలతో హాజరు -

"ఈ రోజు నేను, విమలమ్మా పోలేరమ్మ గుట్టకు వెడుతుంటే... మీ ఊరి కావమ్మ, మంగమ్మ కనిపించారండీ! ఎడ్లబండినిండా వడ్లబస్తాలు వేసుకుని ఏభై ఏళ్ల ముసలమ్మలు బండి నడుపుతుంటే మహా గమ్మత్తుగా ఉంది. వాళ్ల పదేళ్ల వయస్సులో తల్లిదండ్రులు ఏదో ప్రమాదంలో పోయారట. ఎవరూ లేకపోయినా ఆ ఇద్దరూ ఐదెకరాల పొలాన్ని ఆ రోజు నుంచి ఈ రోజు దాకా సొంత వ్యవసాయం చేసుకుంటూ వస్తున్నారట. ఒక పెళ్లీ, పేరంటం ఏమీ లేదట వాళ్లకి!"

మళ్లీ షరా మామూలే. ఆండాళ్లు ఫుల్‌స్టాప్, కామా లేకుండా కబుర్లు కొట్టిపోస్తూండగానే నేను నిద్రలోకి ఒరిగాను.

మూడోరోజు విశ్వం ఆఊరి సంతకి తీసుకెళ్లాడు. ఒకవైపు కూరగాయల సంత, మరోవైపు దూరంగా పశువుల సంత. గమ్మత్తేమిటంటే చాలా పశువులకి ఒక చెవి, రెండుచెవులు తెగిపోయి ఉన్నాయి.

"ఇదేం విలయంరా?" అని విశ్వాన్ని అడిగితే, వాడు చెప్పటం మొదలుపెట్టాడు.

"ఈమధ్య ఇక్కడ బాంకువాళ్లు 'కేటిల్ లోన్' అని పశువులు కొనుక్కోవటానికి లోన్‌ఇవ్వటం మొదలుపెట్టారట. పశువునుకొని బాంకుకు తీసుకుని వెడితే దాని చెవికి గుర్తుకోసం ఒక బిళ్లకొట్టి, ఆ కొన్నవాడికి కొన్నధరని బాంక్‌ఋణంగా ఇస్తుందట. వాళ్లు స్వల్పవాయిదాల్లో, ఐదు సంవత్సరాల్లో ఆ అప్పును తీర్చాలట. జనాలు తెలివిమీరిపోతున్నారు ... పశువుల చెవిని కోసేసి ఆ బాంక్ బిళ్లను అవతల పారేసి మళ్లీ ఆ పశువును ఇంకొకళ్లకి అమ్మి, పశువు చనిపోయిందని బాంక్‌వాళ్లకి దరఖాస్తు పెట్టి ఆ లోన్‌ని ఎగేస్తున్నారట!"

విశ్వం చెప్పిన కథనం నాకు గమ్మత్తుగా తోచింది. ఇలాంటి బుర్రతక్కువ స్కీమ్స్‌ను బాంకులమీద రుద్దితే బాంకులకు నష్టాలు రాక లాభాలు ఎక్కడనుంచి వస్తాయి?

ఆ రోజు ఆండాళ్లు చాలా మూడీగా ఉంది. తలనొప్పిగా ఉన్నదని మేమంతా ఇంకా మాట్లాడుకుంటూండగానే తను వెళ్లిపడుకుంది. నేను పడుకోటా నికి వెళ్లేసరికి ఆండాళ్లు కళ్లుతెరుచుకుని ఇంటి కప్పుకేసి చూస్తోంది. కళ్లెందుకో ఏడ్చినట్టుగా ఎర్రగా ఉన్నాయి. ఏమయిందని తరచి తరచి అడిగితే ... వెక్కిళ్ల మధ్య ఇలా చెప్పింది ...

"ఈరోజు నేనూ, విమలమ్మా కేశవుడి గుడికి వెళ్లామండీ! గుళ్లో దేముడు ఠీవిగావున్నా, దేవాలయం మాత్రం జీర్ణావస్థలో ఉంది అదే విషయం ముసలిపూజారిగారి కోడలిని అడిగితే, ఆవిడ గోడు చెప్పుకుంది -

'ఏం చెయ్యమంటారండీ! ముసలి అత్త మామల్నే చూసుకోవాలా? మతిలేని ఈ మరిదినే చూసుకోవాలా? లేక ఈ దేవాలయాన్నే చూసుకోవాలా? ఎంత విసిగిపోయామంటే, మనసొప్పకపోయినా ఈ పిచ్చిమరిదిని తీసుకెళ్లి తిరుపతిలో వదిలేసి రావాలనుకుంటున్నాం - ఆ దేముడిమీద భారం వేసి. పెద్దవాళ్లని వదల్లేం కదా! బతుకంటే విసుగొస్తోందండీ!' అంటూ కళ్లనీళ్లు పెట్టుకుంది ఆమె.

"తన గురించి మాట్లాడుకుంటున్నా ఏమీ పట్ట నట్లు ఆవిడ మరిది పైకిచూస్తూ, చప్పట్లు కొడుతూ వెకిలిగా నవ్వుతున్నాడండీ!" అక్కడి నుండి వచ్చిన దగ్గర్నుంచీ మనస్సు వికలం అయిందంటూ వెక్కివెక్కి ఏడ్చింది ఆండాళ్లు.

అన్యమనస్కంగా ఇద్దరం పడుకున్నా ఎవరికీ నిద్ర పట్టలేదు. ఆండాళ్లు అసహనంగా పక్కమీద కదులుతోంది. నేను కిటికీనుంచి నక్షత్రాలను చూస్తూ ఎంతసేపున్నానో తెలీదు. అప్పుడే వేగుచుక్క పొడిచింది. వేకువ కాబోతోందనుకుంటూ ...ఆండాళ్లు నామీద చెయ్యేసి తనవైపుకి తిప్పుకుంది.

"ఏమండీ! ఆ మాధవాచారిని మనతో ఢిల్లీ తీసుకెడదామా?" అని అడిగింది.

ఆండాళ్లు తెల్లబడ్డ ముంగురులను సవరిస్తూ, లాలనగా "ఆ పిచ్చివాడిని తీసుకెళ్లి మనం ఏం చేసుకుంటామే?" అన్నాను.

"అదేమిటండీ అలా అంటారు? ఏ అంగవైకల్యం లేనివాడు ఎవరికీ భారం కాదు. ఏదో పని చేసుకుని పొట్టపోసుకుంటాడు. ఏ పనీ దొరక్కపోతే కూలి చేసుకుంటాడు. కానీ మాధవాచారిలాంటి వాడిని ఎవరు పట్టించుకుంటారండీ? మేము గుడిలో ఉండగా అక్కడ పడుకున్న కుక్కనోట్లో వేళ్లు పెడుతున్నాడండీ వాడు! అలాంటి 'అనాడీ' వెధవను తిరుపతిలో వదిలితే ఎలా బతుకుతాడండీ? మనతో తీసుకెళ్లి మంచి డాక్టరుకు చూపిద్దాం. వాడికి అదృష్టం, ఆ కేశవుడి దయా కలిగితే మన ప్రయత్నం సఫలీకృతమై మామూలు మనిషిఅవుతాడు. వాడు చదువుకున్నంత చదివించి మనవాడిని చేసుకుందాం. ఆ విధిరాత సరిగా లేకపోతే మనతోనే మనపంచనే, మనమున్నంత కాలం ఉంటాడు. రిటైర్ అయ్యాక ఈ ఊరికే వచ్చేద్దాం అలాంటప్పుడు. వాడు పుట్టిపెరిగిన ఈ నేలమీదే, అలవాటైన ఈ గాలినే పీలుస్తూ మనతోనే ఉంటాడు. గొడ్రాలినైన నాకు కనీసం ఒక బిడ్డను పెంచే అవకాశం అయినా ఇవ్వండి!" అంది ఆండాళ్లు.

తొలికోడి కుయ్యటం, కేశవుడి ఆలయ ధ్వజస్తంభపు చిరుగంటలు చల్లని పిల్లగాలికి గలగలలాడటం, ఆండాళ్లని ఆర్తిగా దగ్గరకు తీసుకుని, "నీ ఇష్టమే నా ఇష్టం" అనటం ఒకేసారి జరిగినాయి - రిటైర్ అవబోతున్న, అలసిన మా జీవితాలకు ఓ కొంగొత్త మలుపులా...!

